
సాక్షి
తిరుపతి
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



రేషన్ బియ్యం స్వాధీనం
శ్రీకాళహస్తి మండలంలో అక్రమంగా తరలిస్తున్న పది టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



అంగన్వాడీ చిన్నారులకు అస్వస్థత
ఫుడ్ పాయిజన్ కారణంగా ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన ఘటన పెళ్లకూరు మండలంలో చోటుచేసుకుంది. - 8లో



సిబ్బందిపై అడ్మిషన్ల కత్తి!
ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల సిబ్బందిపై అడ్మిషన్ల కత్తి వేలాడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలి



తిరుపతి మంగళం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్‌లో ప్రమాదానికి గురికావడం బాధాకరమని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆ చిన్నారి ప్రమాదానికి గురికావడం తనను కలిచివేసిందన్నారు. శ్రీ కలియుగ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మార్క్‌శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గ్రీవెన్స్‌కు ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో పెండింగ్‌లోని అర్జీలకు పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. వేసవిలో లక్ష మందికి కూలి పనులు కల్పించాలని చెప్పారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము అందజేత

సత్యవేడు: స్థానిక పంచాయతీలోని 1వ సచివాలయం వీఆర్‌ఓ చిట్టిబాబు రూ. 63 వేల పింఛన్ సొమ్మును సత్యవేడు సెక్రటరీ మునిరవికుమార్‌కు మంగళవారం అందజేశారు. ఏప్రిల్‌కు సంబంధించి 64 మందికి పింఛన్లను వీఆర్వో పంపిణీ చేయాల్సి ఉండగా అందులో 48 మందికే అందజేశారు. మిగిలిన 16 మందికి సంబంధించిన పింఛన్ డబ్బు రూ.63 వేలు తన వద్దనే ఉంచుకున్నాడు. గత వారం రోజులుగా అనారోగ్యంతో వైద్యశాలలో ఉండడంతో కార్యాలయానికి రాలేకపోయానని, అధికారులకు అందుబాటులో లేనని వివరణ ఇచ్చారు.

15న శ్రీకాళహస్తిలో మెగా జాబ్‌మేళా

- 30 బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగావకాశాలు
- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ వెల్లడి



ఎమ్మెల్యేలతో కలసి జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఈ నెల 15న శ్రీకాళహస్తిలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, విజయశ్రీతోపాటు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు లోకనాథం,గణేష్‌తో కలసి జాబ్‌మేళా పోస్టర్లను తన కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు 30 బహుళజాతి కంపెనీలు హాజరు కానున్నాయని, 1200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. 5వ తరగతి నుంచి ఉన్నత చదువులు చదువుకున్న వారందరూ అర్హులేనని, దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 13లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అదనపు సమాచారం కోసం 7989509540, 8919889609 (వినయ్) సెల్ నంబర్లను సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి అధికారులు తెలియజేశారు. తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాలతోపాటు హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల్లోనూ ఉద్యోగాలు ఉన్నాయని, విద్యార్హతలను బట్టి వేతనం ఉంటుందని తెలియజేశారు.

యంత్రం.. కుతంత్రం!





జిల్లాలో వ్యవసాయ పనిముట్ల మంజూరు విషయంలో అధికారులు, నేతలు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రైతులకే సబ్సిడీ పనిముట్లు మంజూరు చేస్తున్నారు. అర్హత కలిగిన పేద రైతులను పక్కన పెట్టేస్తున్నారు. ఇదేమని అడిగితే నేతల నుంచి సిఫార్సు లేఖ తెమ్మంటున్నారు. లేకుంటే వారి నుంచి తమకు ఫోన్ చేయించాలని సూచిస్తున్నారు. కూటమి నేతల చుట్టూ తిరగలేక చాలామంది కర్షకులు మిన్నకుండిపోతున్నారు. ఇదే అదునుగా అధికారులు అధికార పార్టీ నేతల సిఫార్సులనే అర్హతగా భావించి పరికరాలు మంజూరు చేస్తున్నారు. దీనిపై అన్నదాతలు రగిలిపోతున్నారు.



రెడ్‌బుక్ పాలనలో పచ్చనేతలకే పనిముట్లు

- తమ్ముళ్లకే సబ్సిడీ యంత్రాలు
- కూటమి నేతల లెటర్లే అర్హత
- మండల నేతలు ఇచ్చిన జాబితా ప్రకారమే మంజూరు
- పేద రైతులకు మొండిచెయ్యి

తిరుపతి అర్బన్: జిల్లాలో రెడ్‌బుక్ పాలన నడుస్తోంది. కక్ష్యలు, కుట్రలు, దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. ఇవి చాలదన్నట్టు ప్రభుత్వం నుంచి అందాల్సిన సబ్సిడీ వ్యవసాయ పరికరాలూ కూటమి నేతలకే చెందుతున్నాయి. అధికారులు సైతం అధికార పార్టీ అధినాయకుల లెటర్లకే ప్రాధాన్యమిస్తున్నారు.

ఇప్పటి వరకు 1,069 దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటివరకు రాయితీ వ్యవసాయ పనిముట్ల కోసం 1,069 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీటిని అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కూటమి నేతల నుంచి సిఫార్సు లెటర్లు ఇస్తేనే ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. లేదంటే మీ ప్రాంతంలోని అధికార పార్టీకి చెందిన నేత దగ్గర నుంచి ఫోన్ చేయించాలని వ్యవసాయశాఖ అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. చేసేది లేక పలువురు పేద రైతులు రాయితీ పనిముట్లపై ఆశలు వదులుకుంటున్నారు. అధికార పార్టీ నేతల అండదండలున్నవారు మాత్రం దర్జాగా పనిముట్లకు పట్టుకుపోతున్నారు.

50శాతం రాయితీ

జిల్లాకు పురుగు మందుల స్ప్రేయర్లు 609, ట్రాక్టర్లకు చెందిన పలు విడిభాగాలు 745, పలు రకాల కట్టర్లు 50 జిల్లాకు వచ్చాయి. మొత్తంగా 1,404 పనిముట్లకు ఇప్పటి వరకు 1,069 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 650 మందికి జిల్లా వ్యాప్తంగా కూటమి నేతల నుంచి లెటర్లు, ఫోన్లు చేయించిన వారికి సిఫార్స్ జాబితాలో రాయితీ పనిముట్లను అప్పగించారు. మిగిలిన వారికి ఈ నెల 15వ తేదీ అందించాలని అధికారులు నిర్ణయించినట్టు సమాచారం.

తమ్ముళ్లకే రాయితీ పనిముట్లు



డ్రోన్ యూనిట్లు

జిల్లాకు 1,404 వ్యవసాయ పనిముట్లను 50శాతం రాయితీతో ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ మేరకు రెండు వారాల క్రితం దరఖాస్తులు ఆహ్వానించారు. వీటి కోసం మొత్తం 445 రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అయితే రైతులు తప్పకుండా పంట ఈ క్రాప్ చేయాల్సి ఉందని, అలాగే ఐదు ఎకరాల లోపు రైతు మాత్రమే అర్హులని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించారు.

డ్రోన్ స్ప్రేయర్లలోనూ సిఫార్సుల జోరు

జిల్లాకు తాజాగా 36 డ్రోన్ యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్ ధర రూ.10 లక్షలు. రైతులకు 80శాతం సబ్సిడీతో వీటిని అందించనున్నారు. ఆ మేరకు రెండు రోజులుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

శిక్షణ లేకుండానే..

గత ప్రభుత్వంలో డ్రోన్ల వినియోగంపై గుంటూరులోని ఆచార్య ఎన్‌జీరంగా యూనివర్సిటీలో రెండు వారాలపాటు కొందరు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులకు డ్రోన్ యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అప్పట్లో శిక్షణ పొందిన విద్యార్థులతో సంబంధం లేకుండా.. పచ్చ నేతలకు శిక్షణ లేకుండా రాయితీ డ్రోన్లు ఇవ్వాలని భావిస్తున్నారు. ఆ మేరకు వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.



కూటమి నేతల చేతుల మీదుగా వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న అధికారులు



పారదర్శకంగా పంపిణీ



వ్యవసాయ పనిముట్లు రైతులకు పారదర్శకంగా అందిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నాం. అంతేతప్ప మాకు సిఫార్సు లెటర్లు ఎవ్వరూ ఇవ్వలేదు. డ్రోన్ విషయంలోనూ అదే మాదిరిగా పాటిస్తున్నాం.

–ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



ఆలయం వెలుపల డైమండ్స్ గ్రూప్ ఆఫ్ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ క్రికెటర్ రవిశాస్త్రి

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,503మంది స్వామివారిని దర్శించుకోగా 23,941 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇక, సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



సినీనటి రంభ

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీనటి రంభ, ప్రముఖ మాజీ క్రికెటర్ రవిశాస్త్రి, డైమండ్స్ గ్రూప్ ఆఫ్ అధినేత గౌతమ్ సింఘానియా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడే అవిశ్వాస తీర్మానం



పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి ,గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా,గూడూరు డీఎస్పీ గీతాకుమారి

- ఎన్నిక ప్రక్రియను వాయిదా వేసేందుకు పచ్చపన్నాగం
- వెంకటగిరిలో 25 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులే

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానాన్ని బుధవారం ఉదయం 10.45 గంటలకు గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్‌తోపాటు గూడూరు డీఎస్పీ గీతాకుమారి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. అయితే ఎలాగైనా ఈ ఎన్నికను వాయిదా వేయించాలని కూటమి నేతలు కుయుక్తులు పన్నుతుండడం విమర్శలకు తావిస్తోంది.

కౌన్సిలర్లకు విప్ జారీ

వెంకటగిరి మున్సిపాలిటీలో 25 మంది మున్సిపల్ కౌన్సిలర్లకు ఆ పార్టీ అధిష్ఠానం విప్ జారీచేసింది. జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనల మేరకు విప్‌జారీ చేశారు. విప్ అందుకున్న సభ్యులంతా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది.

మళ్లీ నక్కా భానుప్రియకే చైర్మన్ పీఠం



అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్‌సీపీ నెగ్గితే ప్రస్తుతం కొనసాగుతున్న నక్కా భానుప్రియే మరో సారి చైర్మన్ పీఠాన్ని అధిరోహించనున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఆమెను ఎంపిక చేయనున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించండి



వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి. అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేసేందుకు చేస్తున్న కుయుక్తులను అధికారులు తిప్పికొట్టాలి. ప్రశాంత వాతావరణంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలి.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సమన్వయకర్త, వెంకటగిరి నియోజకవర్గం

తవ్వేస్తూ.. తరలిస్తూ!

- నాయుడుపేట చుట్టుపక్కల యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- స్వర్ణముఖి వంతెనల వద్ద అడ్డూఅదుపూ లేకుండా తరలింపు
- చెలరేగిపోతున్న కూటమి నేతలు



ఇసుక తవ్వకాలతో గుంతలు, రాళ్ల మయంగా మారిన నాయుడుపేట స్వర్ణముఖి నది ఏరియల్ వ్యూ

నాయుడుపేటటౌన్: స్వర్ణముఖి నదిలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో రాత్రీపగలు తేడాలేకుండా తవ్వేస్తున్నారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని తుమ్మూరు స్వర్ణముఖి నది వద్ద రెండు రైల్వే బ్రిడ్జీల సమీపంలో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులెవ్వరూ కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇసుక తవ్వేది ఇక్కడే

ప్రమాదంలో రైల్వే బ్రిడ్జీలు



స్వర్ణముఖి నదిపై బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జీల సమీపంలో భారీగా ఇసుక తవ్వేస్తుండడంతో వాటికి ప్రమాదం పొంచి ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. రైల్వే అధికారులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు ఇసుకను తమిళనాడుకు తరలించేందుకు డంపింగ్ చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ఇసుకాసురుల ధన దాహానికి గిరిజనుడు బలి

స్వర్ణముఖి నది నుంచి రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తు ట్రాక్టర్ అతి వేగానికి రెండు రోజుల కిందట లో గిరిజనుడు బలయ్యాడు. ఇసుక లోడ్డుతో అతివేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను తుమ్మూరు వద్ద బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం మీక్సిడ్ కాలనీకి చెందిన ఈగ పులయ్య(26) మృతి చెందాడు.



ఇసుక తవ్వకాలతో ఛిద్రమైన స్వర్ణముఖి

మండల పరిధిలోని భీమవరం, చిగురుపాడు, అయ్యప్పరెడ్డిపాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డిపాళెం, మర్లపల్లి తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలతో ప్రమాదం



స్వర్ణముఖి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అర్థం కావడంలేదు. పట్టణ పరిధిలోని తుమ్మూరుతో పాటు పలు చోట్ల నదిలో భారీగా ఇసుక ఆగాధాలు ఏర్పడ్డాయి. పిల్లలు సరదాగా ఈతకెళ్తే అంతే.

– శివకవి ముకుందా, సీపీఎం పార్టీ నాయకులు, నాయుడుపేట

చర్యలు తీసుకుంటాం



స్వర్ణముఖి నదిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే మండల పరిధిలోని పలు చోట్ల స్వర్ణముఖి నది వద్ద అడ్డుగా గోతులు తీశాం. మళ్లీ వీఆర్వోలను పంపించి పరిశీలిస్తాం. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.

– మాగర్ల రాజేంద్ర, తహసీల్దార్, నాయుడుపేట


వెళ్లొస్తాం!

- విదేశీ విహంగాలు తిరుగుముఖం
- సీజన్ పూర్తికావస్తుండడంతో వెలవెలబోతున్న పక్షుల రక్షిత కేంద్రం
- రూ.25 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు



చెరువులో విహరిస్తున్న గూడబాతులు







వెలవెలబోతున్న పర్యావరణ కేంద్రం, (ఇన్‌సెట్) తెలుగు గంగ నీళ్లు సులువుగా చేరేలా కాలువ అభివృద్ధి, చెరువులో పక్షులకు ఆటంకం ఏర్పడకుండా గుర్రపు డెక్క చెట్లను తొలగిస్తున్న కూలీలు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాలు ఆయా దేశాలకు తిరుగుముఖం పట్టాయి. సుమారు ఏడు నెలల పాటు సందర్శకులు, పర్యాటకులు, పక్షి ప్రేమికులతో ఆహ్లాదాన్ని పంచిన పక్షులు ఆయా దేశాలకు తమ పిల్లలతో తిరుగుప్రయాణమయ్యాయి. పర్యాటకులు, పక్షి ప్రేమికుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. సందడిగా ఉండాల్సిన కేంద్రం నేడు వెలవెలబోతోంది. సీజన్‌లో ఆలస్యంగా ఇక్కడకు విచ్చేసిన గూడబాతులు మాత్రమే సుమారు రెండు వందల వరకు అడుగంటిన చెరువు నీటిలో ఈదుతూ సేద తీరుతున్నాయి.


ఇక్కడే పుట్టి...ఎక్కడో పెరిగి!

విదేశీ వలస విహంగాలు నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వాటి వాటి సంతానాభివృద్ధి చేసుకునేందుకు క్రమంతప్పకుండా సీజన్(అక్టోబర్‌లో మొదలై ఏప్రిల్‌కు పూర్తి)లో వేల సంఖ్యలో విచ్చేస్తాయి. సుమారు ఏడు నెలల పాటు కేంద్రం పరిధిలోని నేరేడు, మారేడు, అత్తిగుంట చెరువుల్లోని కడప చెట్లపై బస చేస్తాయి. సమీపంలోని పులికాట్ సరస్సులో చేపలను వేటాడుతూ జీవనం సాగిస్తాయి. పిల్లలను పొదిగి పెద్దవై ఎగిరే స్థాయికి వచ్చిన తర్వాత ఆయా దేశాలకు తిరిగి వెళ్లిపోతాయి. ఈ సీజన్‌లో గూడబాతులు, నత్తగుళ్లకొంగలు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కుకొంగలు, నీటి కాకులు, స్వాతికొంగలు, బాతుల జాతికి చెందిన పలు రకాల పక్షుల 1,7500 వరకు విచ్చేశాయి. 2వేలకు పైగా పిల్లలను పొదిగి తిరిగి ఆయా దేశాలకు ఇప్పటికే 75శాతం వరకు వెళ్లిపోయినట్టు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు. నైజీరియా, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, సైబీరియా తదితర దేశాల నుంచి పక్షుల కేంద్రానికి ప్రతి ఏడాదీ విచ్చేస్తున్న విషయం తెలిసిందే.

రూ.25లక్షలతో అభివృద్ధి పనులు

నేలపట్టు పక్షుల కేంద్రంలో ఇటు పర్యాటకుల సౌకర్యార్థం, అటు విహంగాల అవాసయోగ్యంగా పలు అభివృద్ధి పనులు రూ.25 లక్షలతో చేపడుతున్నట్టు స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలయ్య తెలిపారు.

సిబ్బందిపై అడ్మిషన్ల కత్తి!



తిరుపతి ఎడ్యుకేషన్: ప్రస్తుతం విద్య వ్యాపారంగా మారింది. విద్యాసంస్థలు వాణిజ్య సంస్థలుగా మారాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. వీధికొకటి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టుకొచ్చాయి. కార్పొరేట్ హంగులతో తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్లు పెంచుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నాయి. ఉపాధ్యాయులు, అధ్యాపకులకే కాకుండా చిన్నాచితక బోధనేతర సిబ్బందికి టార్గెట్లు విధిస్తున్నాయి. అడ్మిషన్లు చేస్తే జీతాలు ఇస్తామని, ఉద్యోగం సైతం పదిలంగా ఉంటుందని తెగేసి చెబుతున్నాయి. ఈ క్రమంలో అందులో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది టార్గెట్ పూర్తిచేసే పనిలో పడ్డారు. మండుటెండల్లో ఇంటింటికీ క్యాంపెయిన్ నిర్వహిస్తూ 'మీ పిల్లలను మా విద్యాసంస్థలో చేర్పించండి' అంటూ ప్రాధేయపడుతున్నారు.

ఆగస్టు నుంచే అడ్మిషన్ల వేట

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల సిబ్బంది ఆగస్టు నుంచే అడ్మిషన్ల వేట మొదలు పెడుతున్నారు. పీఆర్వోల పేరుతో సిబ్బందిని నియమించుకుని ఆగస్టులో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల అడ్రెస్‌లను సేకరిస్తున్నారు. ఆ తర్వాత వాళ్ల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను బతిమాలుకుంటున్నారు. ఇప్పుడే అడ్మిషన్ చేయించుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పి నమ్మబలుకుతున్నారు.

మోసపోతున్న తల్లిదండ్రులు

ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రత్యేకతలను గ్రాఫిక్స్‌లో చూపించడంతో తల్లిదండ్రులు ఆకర్షణలో పడి మోసపోతున్నారు. ప్రభుత్వ, స్థానిక ప్రైవేటు పాఠశాలలు మించి తమ విద్యాసంస్థలో ఉన్న సౌకర్యాలను వివరిస్తున్నారు. రోజువారీ టెస్ట్‌లు, ప్రతి రోజూ స్టడీ అవర్స్, కంప్యూటర్, లైబ్రరీ, ల్యాబ్, ప్రతి పండుగ సెలబ్రేషన్, ఆటపాటలతో పాటు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులు బదిలీ అయితే అదేచోట బ్రాంచ్‌కు విద్యార్థుల బదిలీ సౌకర్యం కల్పిస్తామని కార్పొరేట్ స్కూల్ సిబ్బంది వివరిస్తున్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకొని అడ్మిషన్ ఫీజు కట్టించుకునే వరకూ పాఠశాల ఫీజు మాత్రమే చెబుతారు. ఫీజు చెల్లించిన తరువాత బస్సు ఫీజు, యూనిఫామ్, బుక్స్ ఫీజు అంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలు ఆన్‌లైన్‌లో ఫిక్స్ చేసిన ఫీజులని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు నిలువునా మోసపోతున్నారు.

నానా తంటాలు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు గత నెల నుంచే ఆయా పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇంటింటికీ పంపిస్తున్నారు. ఓట్ల ప్రచారం, ఇంటింటి సర్వేలు చేసే వాళ్లలా ఉపాధ్యాయులు ప్రతి ఇంటికీ వెళ్లి మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా.. ఏం చదువుతున్నారని ఆరాతీస్తున్నారు. వారిని తమ పాఠశాల, కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను బతిమాలుకుంటున్నారు. ఒక్కొక్కరు 10–15 మంది పిల్లలను కచ్చితంగా పాఠశాలలో చేర్పించాల్సి రావడంతో ఎండలు సైతం లెక్కచేయక నానా తంటాలు పడుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపకులే కాకుండా అక్కడ వివిధ హోదాల్లో పనిచేసే సిబ్బంది సైతం అడ్మిషన్ల కోసం వెంపర్లాడుతున్నారు.

వేధిస్తూ..టార్గెట్లు విధిస్తూ

జిల్లాలో దాదాపు 2వేలకుపైగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లున్నాయి. ఈ పాఠశాలల్లో దాదాపుగా 40 వేల మంది వరకూ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి ఆయా పాఠశాలల నిర్వాహకులు ప్రస్తుత విద్యాసంవత్సరానికి గత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే అడ్మిషన్ల టార్గెట్ విధిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలవ్వగానే పూర్తి స్థాయిలో టార్గెట్‌ను రీచ్ అవ్వాలంటూ ఆదేశిస్తున్నారు. టార్గెట్ చేస్తేనే జీతం, ఉద్యోగం రెండూ పదిలమంటూ హుకుం జారీచేస్తున్నారు. ఈ నిబంధనలకు పనిచేయాలో.. లేక బయటకు రావాలో.. తెలియక అయోమయ పరిస్థితుల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు.

శోచనీయం



ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విధులు నిర్వహించే బోధన, బోధనేతర సిబ్బందికి అడ్మిషన్ల టార్గెట్ ఇవ్వడం శోచనీయం. చాలీచాలని జీతం, వెట్టి చాకిరీతో సతమతమవుతున్న వారిపై టార్గెట్ అదనపు భారమవుతోంది. దీనిపై విద్యా శాఖ, కూటమి ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

–కె.శివారెడ్డి, జాతీయ కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

టార్గెట్ వేదన



ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేసే సిబ్బందిపై టార్గెట్ వేదన అధికమవుతోంది. ఇదివరకు పీఆర్వో విభాగాన్ని ఏర్పాటు చేసుకుని అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టేవారు. అయితే కొంత కాలంగా అక్కడ పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందితో అడ్మిషన్లు చేయిస్తున్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం స్పందించాలి.

–ఎస్.అక్బర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ

క్లుప్తంగా

పది టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం, నిందితుడితో విజిలెన్స్ అధికారులు

శ్రీకాళహస్తి: పది టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం శ్రీకాళహస్తి మండలంలో చోటు చేసుకుంది. తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు సీఐ వెంకటరవి, ఎస్ఐ రామకృష్ణ నాయక్, సీఎస్డీటీ రవిచంద్రబాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకటాద్రి, కానిస్టేబుల్ అయ్యప్ప నేతృత్వంలో దాడులు చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ముసలిపేడు మార్గంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్టు సమాచారం రావడంతో రామాపురం జలాశయం వద్ద బియ్యంతో వెళుతున్న వాహనాన్ని అడ్డుకున్నట్టు పేర్కొన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.3.51 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేవీబీపురం మండలం, కోవనూరు గ్రామానికి చెందిన వెంకటయ్య కుమారుడు కే.రాజేష్ (25)ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం బియ్యాన్ని శ్రీకాళహస్తి ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించామని, నిందితునితోపాటు వాహనాన్ని శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గోవింద ధామానికి భూమిపూజ

చంద్రగిరి: స్థానిక శ్రీనివాసమంగాపురం మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న గోవింద ధామంకు మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే పులివర్తినాని హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ చంద్రగిరి మండల ప్రజలకు ఇబ్బంది కలగకుండా హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరుపుకునేలా వారి సౌకర్యార్థం 'గోవింద ధామం' ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గోవింద ధామం ఏర్పాటుతో చంద్రగిరి ప్రజలకు ఎంతగానో ఉపయోగకరమన్నారు. సర్పంచ్‌లు రేవతి, ముదికుప్పం రూపరామ్మూర్తి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న చిన్నారులు

పెళ్లకూరు: మండలంలోని కానూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని ఆరుగురు చిన్నారులకు మంగళవారం ఫుడ్‌పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు.. అంగన్‌వాడీ కేంద్రంలో ఏనిమిది మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో ఆరుగురికి మంగళవారం మధ్యాహ్నం పులిహోర వడ్డించారు. మిగిలిన ఇద్దరు చిన్నారులు ఇంటికి వెళ్లారు. పులిహోరా తిన్న చిన్నారులు గురువర్షిత్, జోషన్, జశ్వన్, నాని, గురవయ్య, శాన్విక గంట వ్యవధిలో వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. సీడీపీవో ఉమామహేశ్వరి, నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మి ఆస్పత్రికి చేరుకుని చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీశారు. విపరీతమైన ఎండలు, మధ్యాహ్నం పులిహోర తినడం వల్ల వాంతులయ్యాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అక్కడి వైద్యులు వెల్లడించారు. చిన్నారులను రాత్రికి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. వీరివెంట అంగన్‌వాడీ వర్కర్ శ్రీదేవి, చిన్నారుల తల్లిండ్రులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం రిజర్వాయర్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం.. రామాపురం డ్యాం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమితం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద రెండు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు ఉన్నట్టు గుర్తించారు. మిగిలిన ఆధారాలు ఏమీ లేకపోవడంతో గుర్తితెలియని మృతదేహంగా కేసు నమోదుచేశారు.

మూత ఎట్టా తీయాలబ్బా..!



ఎండ తీవ్రతకు ప్రజలే ఇబ్బందులు పడుతున్నారు. మజ్జిగ, నీళ్లు, శీతల పానీయాలు వంటివి ఎక్కువగా పుచ్చుకోవడమూ పెరిగింది. ప్రజలకే ఇలా ఉంటే..ఇదే కష్టం ఓ వానరానికీ వచ్చింది. మంచి ఎండకు గొంతెండిపోతోందేమో మరి. దానికి ఓ వాటర్ బాటిల్ కనిపించేసరికి ప్రాణం లేచొచ్చినట్టైంది. ఆత్రంగా ఆ బాటిల్ తీసుకుంది. మూత వేసి ఉన్న ఆ బాటిల్‌లో అడుగున నీరు ఉండడంతో అటూ ఇటూ తిప్పింది. ఎట్టకేలకు మూతను నోటితో లాగి..లాగి..తీసి, ఆబగా తాగేసింది. హమ్మయ్య గొంతు తడిసిందనే రిలీఫ్ ఆ బాటిల్‌ను పడేసి తుర్రుమంది. ఈ సంఘటన మంగళవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయం ముందు దాహార్తి వానరం చూపరులను ఆకర్షించింది.!

–చిల్లకూరు

పారంపర్య వైద్యానికి పెద్దపీట



పారంపర్య వైద్యంపై చర్చిస్తున్న వైద్యులు

తిరుపతి మంగళం : వంశపారంపర్యంగా చేస్తున్న వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహ కారం అందిస్తోందని ఏపీ ఔషధ, సుగుంధ మొక్కల బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. తిరుపతి కపిలతీర్థంలోని ప్రధాన ఆటవీశాఖ కార్యాలయంలో మంగళవారం తిరుపతి సర్కిల్ సీఎఫ్ సి.సెల్వంతో కలిసి ఆయన వైద్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఔషధ మొక్కలను ఆధారంగా చేసుకుని వైద్య విధానం కొనసాగుతోందన్నారు. అద్భుతమైన ఫలితాలనిచ్చే మందులు కూడా ఉన్నాయని చెప్పారు. అయితే అలాంటి ప్రకృతి వైద్యం చేసేవారికి, చేసే వైద్యానికి ఎలాంటి గుర్తింపు లేదని, దీని కారణంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. అలాంటి వైద్యులకు చేయూతనిస్తామని చెప్పారు. ఎస్వీయూ బోటనీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జే.కామాక్షమ్మ, రేజర్ల ప్రభాకర్, పారంపర్య వైద్యులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అధికారుల బదిలీ



కలెక్టర్‌తో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి



ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డిని తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి తిరుపతికి విచ్చేశారు. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోత్స్నకు జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే మంగళవారం నూతనంగా విచ్చేసిన రాజేంద్రనాథ్‌రెడ్డి జిల్లా పగ్గాలు చేపట్టారు. అలాగే జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా పనిచేస్తున్న సూర్యనారాయణను విశాఖపట్నం జిల్లాకు బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న రాజా సోమును తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శెట్టిపల్లి భూసమస్యకు పరిష్కారం చూపుతాం



మీడియాతో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చూపుతామని, మోడల్ టౌన్షిప్‌గా రూపుదిద్దుకునేలా చర్యలు చేపడుతామని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి ఆయన అధికారులతో శెట్టిపల్లి భూ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి సూళ్లూరుపేట, చంద్రగిరి ఎమ్మెల్యేలు విజయశ్రీ, పులివర్తి నాని, యాదవ సంఘం నేత నరసింహ యాదవ్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విజన్ 2020 తరహాలోనే విజన్ 2047కు సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. శ్రీసిటీలో పలు పరిశ్రమల స్థాపనకు రెండో దఫా భూ కేటాయింపుల్లో భాగంగా 2,500 ఎకరాలు అందించనున్నట్టు వెల్లడించారు. తిరుపతిలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ భూమి కేటాయిస్తామన్నారు. అలాగే టీడీఆర్ బాండ్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పులికాట్ ముఖద్వార పూడికతీతకు రూ.100 కోట్లతో పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే లైన్, సాగరమాల పనులు త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపడుతామన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పశువుల షెడ్ల పరిశీలన



దాసుకుప్పంలో సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

సత్యవేడు: మండలంలో దాసుకుప్పం పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన ఐదు సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్డును మంగళవారం డ్వామాపీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. అనంతరం దాసుకుప్పం పంచాయతీలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ తమకు బిల్లులు మంజూరు కాలేదని ఆరోపించారు. పీడీ స్పందిస్తూ త్వరలో బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఏపీఓ విజయభాస్కర్, ఉపాధి హామీ జేఈ హరి, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమాస్తుల కేసులో మళ్లీ సోదాలు

- గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన చంద్రగిరి పంచాయతీ ఈవో
- సదరు ఈవోను సస్పెండ్ చేసిన జిల్లా ఉన్నతాధికారులు
- సస్పెన్షన్‌లో ఉండగానే మరోసారి సోదాలు



మహేశ్వరయ్య ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య లంచం తీసుకుంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఏసీబీకి చిక్కారు. అధికారులు ఆయనను కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. అయితే సరిగ్గా నెల రోజుల తర్వాత ఆయన ఇంటిపై మరోసారి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఇంట్లోని పలు కీలక డాక్యుమెంట్లను సీజ్ చేసినట్టు సమాచారం.

ఆదాయానికి మించి ఆస్తులు

తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ సమీపంలోని ఏకదంతా అపార్ట్‌మెంట్‌లో ఉన్న మహేశ్వరయ్య ఫ్లాటుకు మంగళవారం ఉదయమే ఏసీబీ అధికారులు చేరుకున్నారు. అతని కుటుంబీకులకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బంగారం, వెండికి సంబంధించిన బిల్లులు, స్థిరాస్తులకు సంబంధించిన దస్తావేజులను పరిశీలించి.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహేశ్వరయ్యను జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే సస్పెండ్ చేయగా మరోసారి ఆయన ఇంట్లో సోదాలు చేయడం చర్చనీయాంశమైంది. మహేశ్వరయ్య ఇంటితో పాటు కారు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు నిర్వహించిన సోదాల్లో సుమారుగా మార్కెట్ విలువ ప్రకారం రూ.30 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు అధికారులు అంచనా వేసినట్టు సమాచారం. అయితే అధికారికంగా ఏసీబీ అధికారులు సోదాలు పూర్తయిన తరువాత పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

ముగిసిన పోస్టల్ రాష్ట్ర మహా సభలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వేదికగా గత మూడు రోజులుగా జరిగిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమెన్, ఎమ్‌టీఎస్ రాష్ట్ర శాఖ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. తపాలా శాఖ ప్రయివేటీ కరణను తిప్పికొట్టడానికి రాష్ట్రంలో ఉన్న తపాలా ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. మేలో జరగనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆర్.పి.సారంగ్ పిలుపునిచ్చారు. చివరిగా రాబోయే రెండేళ్ల కాలానికి 15 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమెన్ అండ్ ఎమ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్. విద్యాసాగర్, కే.మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది ఉద్యోగులు డెలిగేట్‌లుగా, పరిశీలకులుగా పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐ స్కిల్స్‌పై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ట్రైనింగ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన



సదస్సులో పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా

నెల్లూరు (పొగతోట): హర్యానా ఐఐఎంలో పంచాయతీలో సమర్థవంతమైన పాలన, నాయకత్వ నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి జిల్లా పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా హాజరయ్యారు. ఈ మేరకు పంచాయతీ పాలన, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ అవకాశం కల్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం ఇప్పించండయ్యా !



రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ సమీక్ష చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న సుగాలీలు

తిరుపతి అర్బన్: 'రైల్వే లైన్ వేయాలంటూ మా ఇళ్లు తీసుకున్నారు. రెండు నెలల క్రితమే కొట్టేశారు. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. దూర ప్రాంతంలో ఇంటి పట్టాలు చూపించారు. ఆ స్థలంలో ఇంటిని నిర్మించుకోవడానికి సాయం చేయలేదు. వీధుల్లో నివాసం ఉంటున్నాం. మేము కూడా మనుషులమే సర్' అంటూ పలువురు సుగాలీలు తిరుపతి కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమాచారం అందుకున్న రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీకి చెందిన 26 సుగాలీల కుటుంబాలు తమకు న్యాయం చేయాలంటూ మంత్రి చాంబర్ ముందు ఆందోళనకు దిగారు. కొత్త రైల్వే లైన్ వేస్తున్నామంటూ 26 ఇళ్లు కూల్చివేశారని వాపోయారు. అయితే 21 మందికి మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చారని ఆవేదన చెందారు. ఐదు పట్టాలను ఎవరు నొక్కేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. న్యాయం కోసం మంత్రిని కలిసి తమ బాధను తెలియజేస్తామంటూ భీష్మించారు. సమాచారాన్ని తెలుసుకున్న తిరుచానూరు పోలీసులు ఎస్ఐ జగన్నాథంరెడ్డి నేతృత్వంలో సుగాలీలకు సర్ది చెప్పారు. ఆందోళన వద్దని, తర్వాత జిల్లా అధికారులను కలసి సమస్యను చెప్పుకునే అవకాశం కల్పిస్తామని చెప్పడంతో వారంతా తిరిగి తూకివాకం వెళ్లిపోయారు.

నాటు తుపాకీ పేలి ఒకరి మృతి



మాట్లాడుతున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి రూరల్: బాలాయపల్లి మండలం, కోటంబేడు గ్రామానికి చెందిన రమణయ్య నాటు తుపాకీ పేలి మృతి చెందినట్లు వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోటంబేడు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు శివప్రసాద్ స్థానిక పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారన్నారు. దర్యాప్తు నిర్వహించగా కోటంబేడు తెలుగుగంగ కాలువ బ్రాంచ్ కెనాల్ వద్ద మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. దర్యాప్తులో ఓజిలి మండలం, రావిపాడు గ్రామానికి చెందిన కొండా శివయ్యతో గత నెల 30వ తేదీ వెంకటరమణయ్య కలసి నాటు తుపాకీతో అడవి పందుల వేటకు ద్విచక్ర వాహనం పై వెళ్లినట్లు తేలిందన్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం గుంతల్లో అదుపు తప్పి నాటు తుపాకి పేలి గుండు రమణయ్యకు తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్టు వెల్లడించారు. దీంతో శివయ్య రమణయ్య మృతదేహాన్ని సమీప తెలుగుగంగ కాలువలో పడేసి అడవుల్లో తిరుగుతూ కాలం వెలదీశాడన్నారు. నీటిలో ఉన్న మృతదేహం పైకి తేలడంతో మృతదేహాన్ని సమీప ముళ్ల పొదల్లో పడేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 4వ తేదీన అటవీ ప్రాంతంలో రమణయ్య మృతదేహం గుర్తించి పోస్టుమార్టం నిర్వహించినట్లు వివరించారు. ఆపై శివయ్యను అరెస్టుచేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.